

జిల్లా కేంద్రంలోని మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి వివిధ రూపాలు

# వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

## ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

జిల్లాలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి వేడుకలు విజయ దశమితో ముగిశాయి. మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు మంగళవారం ఉత్తరపూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. జిల్లా కేంద్రంలో దేవీ శోభాయాత్ర నిర్వహించి బాసర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి అమ్మవారికి వీడ్కోలు పలికారు. భవానీ మాలదారులు దీక్షలను విరమించారు. జిల్లా కేంద్రంలో అందంగా అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లో అమ్మవారి విగ్రహాలు ఆకట్టుకున్నాయి.

-నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 24



రుద్రూర్‌లో అమ్మవారికి మంగళ హారతులు, బోనాలతో వీడ్కోలు పలుకుతున్న భక్తులు



కమ్మర్‌పల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఎడపల్లిలో అందంగా అలంకరించిన రథంపై అమ్మవారి విగ్రహం



ఏర్గట్లలోని అమ్మవారి ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న కళాకారుల



రెంజల్‌లో దుర్గామాత శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు



బోధన్‌లోని సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర



# దినకర్ మహరాజ్ ఇకలేరు

- అనారోగ్యంతో బడా రామ్‌మందిర్ పీఠాధిపతి కన్నుమూత

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 24 : ఛత్రపతి శివాజీ మహారాజ్ గురువు సమర్ధ రామదాసు స్వామి చేత ఇందూరులో స్థాపింపబడిన బ్రహ్మపురి బడా రామ్మందిరం పీఠాధిపతి దినకర్ మహరాజ్ (93) ఇక లేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి కన్నుమూశారు. 40 ఏండ్లుగా పెద్ద రామమందిరం మఠం, లోకకల్యాణం కోసం దినకర్ మహరాజ్ ఎన్నో ధార్మిక సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా శ్రీరామనవమి వేడుకలను ఏటా భారీ ఎత్తున నిర్వహించేవారు. మహరాజ్ అంతిమ సంస్కారాన్ని మంగళవారం మధ్యాహ్నం పెద్దరాంమందిర్ ఆవరణలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, మఠాధిపతుల శిష్యులు పాల్గొని నివాళులర్పించారు. ప్రస్తుత పీఠాధిపతి రామచంద్రస్వామి, అజయ్ సంగ్వాయి, కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్, రొట్టే సురేశ్, రాజ్‌కుమార్ సుబేదార్, కోసలి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ భరద్వాజ్ తదితరులు దినకర్ మహరాజ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చందూర్, అక్టోబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. మండలకేంద్రంలోని సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ లావణ్యా రాంరెడ్డి, విండో చైర్మన్ ప్యారం అశోక్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్నదని చెప్పారు. ఏ- గ్రేడ్ రకానికి రూ. 2,203, బీ-గ్రేడ్‌కు రూ. 2,183 చెల్లిస్తున్నట్లు వివరించారు. ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు సాయారెడ్డి, సత్యనారాయణ, సొసైటీ కార్యదర్శి భూమయ్య, డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లావణ్యా రాంరెడ్డి, నాయకులు

# విస్తృతంగా తనిఖీలు

## జిల్లాకు ప్రత్యేక బలగాలు

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 24: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుతో కలిసి నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు, అల్లర్లు జరగకుండా సోమవారం పకడ్బందీ చర్యలు చేపట్టారు. రద్దీగా ఉన్న ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.



ప్రత్యేక బలగాలతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు

## షార్ట్ ఫిల్మ్‌లకు ఆహ్వానం

ధర్పల్లి, అక్టోబర్ 24 : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత షార్ట్ ఫిల్మ్‌లు చేయాలని ఎస్సై వంశీకృష్ణారెడ్డి మగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 వరకు పోలీసు వ్యవస్థ పనితీరు, గొప్పదనం, తీసుకోవాల్సిన చర్యలను ప్రతిబింభించేలా మూడు నిమిషాల నిడివితో వీడియోలు ఉండాలని పేర్కొన్నారు. వెబ్‌లింక్‌లో తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని షార్ట్ ఫిల్మ్‌లను అప్‌లోడ్ చేయాలని ఉత్తమ వీడియోలకు బహుమతులను అందజేస్తామని వెల్లడించారు.

## యువకుడి అదృశ్యం

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 24 : మండలకేంద్రానికి చెందిన యువకుడు రాజు ఆదివారం నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తున్నదని తెలిపారు. యువకుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 24 : మండల కేంద్రానికి చెందిన అల్లెపు నర్సింహరాజు (32) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఆయన ఈ నెల 22న సాయంత్రం బైక్‌పై బయటికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. గ్రామ చెరువులో రాజు మృతదేహం మంగళవారం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని ఎస్సై తిరుపతి పరిశలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.